నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ సోమవారం 23 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL



జాతీయ రహదారిపై వంటావార్పు చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

## వినూత్నం.. ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

*సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగ, ఉపాధ్యాయుల నిరసనలు వినూత్నంగా కొనసాగుతున్నాయి. నిర్మల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె ఆదివారం నాటికి 13వ రోజుకు చేరుకుంది. ఈ నిరసనలో భాగంగా ఆదివారం జాతీయ రహదారిపై వంటావార్పు చేసి సామూహిక భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.*

*- నిర్మల్ అర్బన్, డిసెంబర్ 22*

తొలి విడుత సాగైన తోటల్లో కోతకొచ్చిన గెలలు

# ఆనందంలో ఆయిల్ పామ్ రైతులు



కోతకొచ్చిన ఆయిల్ పామ్ గెల

- ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహమిచ్చిన కేసీఆర్ ప్రభుత్వం
- నిర్మల్ జిల్లాలో 8,200 ఎకరాల్లో సాగు
- వచ్చే జూన్ నాటికి కోత దశలో నాలుగు వేల ఎకరాలు
- టన్నుకు రూ.20,400 ధర
- ఎకరాకు 5 నుంచి 10 టన్నుల దిగుబడి
- త్వరలో ప్రారంభం కానున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు



ఆయిల్ పామ్ గెలలను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న కూలీలు

నిర్మల్, డిసెంబర్ 22(నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో వరికి ప్రత్యామ్నాయంగా అధిక లాభాలు వచ్చే వాణిజ్య పంటలను రైతులు సాగు చేయాలని అప్పటి సీఎం కేసీఆర్ కన్న కలలు సాకారమవుతున్నాయి. ఆశించిన వర్షాలు కురియకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తలెత్తే ఇబ్బందుల కారణంగా రైతులు ఆర్థికంగా నష్టపోవద్దన్న ఉద్దేశంతో ఆ యిల్ పామ్ సాగుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రోత్సాహకాలు కల్పించింది. దీంతో జిల్లావ్యాప్తంగా సాగుకు ముందుకొచ్చిన రైతులు గత మూడేళ్లలో 8,200 ఎకరాల్లో సాగు చేశారు. అయితే ఆ ఫలాలు ఇప్పుడిప్పుడే అందుతున్నా యి. జిల్లాలో అం దరికంటే ముం దు 2021 సం వత్సరంలో దిలావర్‌పూర్ మండలంలోని గుండంపెల్లిలో రాగ లత 15 ఎకరాల్లో మొక్కలను నాటగా, ఈ యేడు దిగుబడి వచ్చింది. ఇక్కడి క్షే త్రంలో మొత్తం 1000 ఆయిల్ పామ్ మొక్కలు నాట గా, అందులో దాదాపు 600లకు పైగా మొక్కలకు గెలలు కోతకు వచ్చాయి. ప్రస్తుతం ఎకరానికి దాదాపు రెండు టన్నుల గెలల దిగుబడి రావడంతో టన్నుకు రూ.20,400 ధరను కల్పించి ప్రీ యూనిక్ కంపెనీ కొ నుగోలు చేసింది. వచ్చే రెండు మూడు నెలల్లో ఎకరానికి మూడు టన్నులకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. కాగా.. వచ్చే జూన్ నుంచి జిల్లాలోని దాదాపు నాలుగు వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ దిగుబడి



గుండంపెల్లిలో ఏపుగా పెరిగిన ఆయిల్‌పామ్ చెట్లు

వస్తాయని ఉద్యానవన శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ఆయిల్ పామ్ మొక్క వయసు పెరిగే కొద్దీ దిగుబడి పెరుగుతుంది. అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా ధరలు ఉండడంతో రైతులకు ఏడాది పొడవునా మంచి ఆదాయం సమకూరుతుందని సాగును పర్యవేక్షిస్తున్న ప్రీ యూనిక్ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

### కేసీఆర్ ప్రభుత్వం కృషి

రైతులను లాభాల బాట పట్టించడమే కాకుండా, ప్రత్యామ్నాయ సాగు వైపు దృష్టి సారించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించింది. ఆయిల్ పామ్ సాగుకు ముందుకొచ్చిన రైతులకు సబ్సిడీలతోపాటు డ్రిప్ ఇరిగేషన్ సదుపాయాన్ని కల్పించింది. అలాగే నాలుగేళ్లపాటు నిర్వహణ, ఎరువుల కోసం ఎకరానికి రూ.4200 చొప్పున అందించింది. అంతేకాకుండా జిల్లా రైతులకు అందుబాటులో ఉంచేందుకు సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి వద్ద పెద్ద ఎత్తున నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచారు. రూ.200 విలువ గల మొక్కకు రూ.180ల సబ్సిడీ ఇచ్చి కేవలం రూ.20లకే ఒక మొక్కను రైతులకు అందించింది. దీంతో నిర్మల్ జిల్లాలో పెద్ద సంఖ్యలో రైతులు ఆయిల్ పామ్ తోటలను పెంచేందుకు ముందుకొచ్చారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 8,200 ఎకరాల్లో మొక్కలను పెంచుతున్నారు. అయితే ఈ ప్రాంతంలో పండిన ఆయిల్ పామ్ దిగుబడులను ఇక్కడే విక్రయించేందుకు అనుగుణంగా జిల్లాలోని పాక్‌పట్ల ప్రాంతంలో పామాయిల్ పరిశ్రమ ఏర్పాటుకు అప్పటి మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డిలు శంకుస్థాపన చేశారు. అయితే ఈ పరిశ్రమ నిర్మాణానికి కంపెనీ ప్రతినిధులు మరికొంత భూమిని సేకరించడంతో పరిశ్రమ పనులు కొంత ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం భూసేకరణ పూర్తి కావడంతో త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. పరిశ్రమ నిర్మాణం పూర్తయ్యే వరకు పంట కొనుగోలు బాధ్యత పూర్తిగా ప్రీ యూనిక్ కంపెనీదే. ఆయిల్‌పామ్ తోటల పెంపకాన్ని పర్యవేక్షిస్తున్న ప్రీ-యూనిక్ కంపెనీ రవాణా ఖర్చులు భరించి ఇక్కడి పంటను ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేటలో గల పామాయిల్ పరిశ్రమకు తరలిస్తున్నది. రవాణా, ఇతర ఖర్చులు లేకుండానే దిగుబడులను అమ్ముకునే వెసులుబాటును ప్రీ-యూనిక్ కంపెనీ కల్పిస్తుండడంపై ఆయిల్‌పామ్ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కోసిన గెలలను ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం





గుండంపెల్లి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ గెలలను కోస్తున్న కూలి

### ఎకరానికి రూ.10వేల ప్రోత్సాహాన్ని ఇవ్వాలి..



రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు కేసీఆర్ ప్రభు త్వం కృషి చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే 5 ఏళ్లలో 20 లక్షల ఎకరాల్లో తోటలను సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు 2021లో క్యాబినెట్ ఆమోదించింది. ప్రతి సంవత్సరం నాలుగు లక్షల ఎకరాల్లో సాగు అయ్యేలా రైతులను సిద్ధం చేయాలని ప్రణాళికలు వేసుకు న్నప్పటికీ, గతేడాది కాలంగా అది ఆచరణకు నోచుకోవడం లేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వా నికి ఆయిల్ పామ్ సాగుపై చిత్తశుద్ధి లేదు. 2023-24లో రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల ఎకరాల్లో కూడా సాగు కాలేదు. వ్యవసాయ మంత్రికి పట్టింపు లేదు. రైతులకు ప్రోత్సాహం అందడం లేదు. తోటల నిర్వహణకు ఆరు నెలలకోసారి ఇచ్చే రూ.2,100 కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. దీంతో ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావడం లేదు. వరికి ప్రత్యామ్నా యంగా దీర్ఘకాలంపాటు ఆదాయాన్ని ఇచ్చే ఏకైక పంట ఆయిల్‌పామ్. వరి రైతులకు బోనస్ ఇస్తున్నట్లే, ఆయిల్‌పామ్ రైతులకు కూడా ఏడాది పొడవునా పంట నిర్వహణ కోసం ఎకరానికి రూ.10 వేల ప్రోత్సాహకాన్ని ఇవ్వాలి. ఆయిల్ పామ్ పంటను ప్రోత్సహించడం వల్ల విద్యుత్ తోపాటు, సాగునీటి వినియోగం తగ్గుతుంది. అలాగే ఎరువులు, పురుగు మందుల విని యోగం తగ్గుతుంది. పర్యావరణానికి మేలు చేసే ఆయిల్‌పామ్ సాగును పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

**- ఎల్.వెంకట్‌రాంరెడ్డి, రాష్ట్ర ఉద్యానవన శాఖ మాజీ కమిషనర్, నిర్మల్.**



బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తున్న ఎమ్మెల్యే

## బాలిక కుటుంబానికి పరామర్శ

### ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

గుడిహత్నూర్, డిసెంబర్ 22 : గుడిహత్నూర్ మండల కేంద్రంలో శనివారం రాత్రి మైనర్ బాలికపై జరిగిన ఘటనను తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం రిమ్స్‌లో ఉన్న బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమల్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు జాదవ్ భీంరావ్, గజానంద్ గిత్తె, బుద్దె గోవింద్ ఉన్నారు.




నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

## సమస్యలను పరిష్కరించాలి

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 22 : కేజీబీవీ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆదివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో స్థానిక అర్బన్ కేజీబీవీ పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, 13 రోజులుగా సమ్మె చేస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని, పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థుల చదువులు సక్రమంగా సాగడం లేదని, ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



అంబేద్కర్‌చౌక్ వద్ద రోడ్డుపై కుర్చుని ధర్నా చేస్తున్న అంబేద్కర్ ఆత్మగౌరవ ఉమ్మడి ఉద్యమ కార్యాచరణ కమిటీ నాయకులు

## అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

*ఎదులాపురం, డిసెంబర్ 22 : పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట అంబేద్కర్ ఆత్మగౌరవ ఉమ్మడి ఉద్యమ కార్యాచరణ కమిటీ నాయకులు అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని పురవిధుల గుండా అంబేద్కర్ చౌక్ వరకు కొనసాగింది. అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో గోడం గణేశ్, నజీర్ అహ్మద్, సాజిదొద్దీన్, మౌలానా అస్లాం, షేక్ శిరాజ్, ఖలీల్ అహ్మద్, దాండుగే సందీప్, నిమ్మల ప్రశాంత్, ఈర్ల దయాకర్, రత్నపురం రమేశ్, అర్షత్ ఖాన్, సంతోష్, నాక్షిన్, వెంకీ మనోజ్, సామల ప్రశాంత్, పరమేశ్, అనిల్ పాల్గొన్నారు..*

## గంజాయిరహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 22 : నిర్మల్ జిల్లాను గంజాయిరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. ఆదివారం డీఎస్పీ గంగారెడ్డి నేతృత్వంలో పోలీసులు, యాంటీ నార్కొటిక్ డ్రగ్స్, డాగ్ టీంలు మత్తు పదార్థాల కోసం బంగల్‌పేట్‌లో గల డబుల్ బెడ్రూం ఇండ్లలో జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. గంజాయి రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. మాదక ద్రవ్యాల సమాచారాన్ని పోలీసులకు అందించాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై సాయి కుమార్, సిబ్బంది మహిపాల్, సాయన్న, సాయేందర్, కిరణ్, రెహమాన్, ప్రణిత ఉన్నారు.



జాగిలాలతో తనిఖీలు చేస్తున్న పోలీసులు

## 31లోగా దరఖాస్తు పత్రాలను అందజేయాలి

ఎదులాపురం, డిసెంబర్ 22 : 2024-25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న ఎస్సీ విద్యార్థులు రెన్యూవల్, ఫ్రెష్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకున్నటు వంటి పత్రాలను ఈనెల 31వ తేదీ వరకు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదిలాబాద్ జిల్లా సంక్షేమ కార్యాలయానికి సమర్పించాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి భగత్ సునీత కుమారి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉపకార వేతనాల మంజూరు కోసం అన్ని ధ్రువపత్రాలతో ఈపాస్‌లో రిజిస్ట్రేషన్ చేయించి, దరఖాస్తు పత్రాలను జతపరిచి సమయానికి కార్యాలయానికి అందించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులపై ఆదిలాబాద్ కలెక్టర్ చర్యలు తీసుకోనున్నారని తెలియజేశారు.

## శానిటరీ ప్యాడ్స్ తయారీ బంద్

కుంటాల, డిసెంబర్ 22 : కుంటాల మండల కేంద్రంలో రూర్బన్ పథకం కింద రూ.20 లక్షలతో బయోడిగ్రేడెబుల్(పర్యావరణ అనుకూలం) శానిటరీ ప్యాడ్స్ తయారీ కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు కాగా.. తయారైన ప్యాడ్స్‌ను వివిధ కస్తూర్బలకు అందించేది. కొన్ని నెలలుగా మూసి ఉంచారు. మార్కెట్‌లో గిరాకీ తగ్గడం వల్లే ఉత్పత్తి ఆపివేశామని ఏపీఎం అశోక్ చెబుతున్నారు. మార్కెట్‌లో విక్రయించాలని ఐకేపీ సిబ్బందికి లక్ష్యాలు నిర్దేశించినా ఆశించిన స్థాయిలో నాణ్యత లేకపోవడంతో వినియోగదారులు ఆసక్తి చూపలేదు. ఈ యూనిట్ మూసివేతతో పనిచేసే ఇద్దరు మహిళా ఉద్యోగులు ఉపాధి కోల్పోయారు.



మూసి ఉన్న కుంటాలలోని శానిటరీ ప్యాడ్స్ తయారీ కేంద్రం

## నూతన కార్యవర్గం ఎన్నిక

ఇంద్రవెల్లి, డిసెంబర్ 22 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవనంలో నిర్వహించిన ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ యూనియన్ నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నిర్వహించిన నూతన కార్యవర్గ ఎన్నికల్లో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ యూనియన్ జిల్లా అధ్యక్షులుగా ఇంద్రవెల్లి మండలానికి చెందిన ఉపాధ్యాయుడు గేడం శ్యామ్‌సుందర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కుంరం బాజీరావ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సుంగు, ప్రధాన కార్యదర్శి గేడం శ్రీరాంలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్, పరుశురాం, విలాస్, దివాకర్, అశోక్, శ్రీధర్ పాల్గొన్నారు.



జిల్లా అధ్యక్ష, కార్యదర్శిని శాలువాతో సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

## ప్రేయసి కోసం..

### బుర్కా వేసుకుని వెళ్లిన యువకుడు

ఎదులాపురం, డిసెంబర్ 22 : ఓ యువకుడు తన ప్రేయసి కోసం హిజాబ్(బుర్కా) వే సుకుని కలవడానికి వచ్చి కాలనీవాసులకు దొరికిపోయిన ఘటన మావల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. నేరడిగొండ మండలానికి చెందిన ఓ యువకుడు నిర్మల్ జిల్లాకు చెందిన యువతి రాంనగర్‌లో అద్దె కు ఉంటున్నది. యువతి అద్దెకు ఉంటున్న పరిసరాల ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయి. దీంతో ఆ యువతిని ఆ యువకుడు కలవాలి అనుకున్నాడు. సినిమాల్లో చూపించినట్లే యువకుడు బుర్కా వేసుకుని వెళ్తే ఎవరు గుర్తు పట్టాలనుకున్నాడు. అలానే చేసి న యువకుడిని కాలనీవాసులు పట్టుకున్నారు. ఎందుకు వచ్చావు? బుర్కా వేసుకుని ఏం చేయడానికి వచ్చావంటూ.. ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కాలనీ వాసులు పో లీసులకు సమాచారం అందించారు. దీంతో యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకువెళ్లారు. విచారణ చే పట్టి యువకుడి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి వదిలిపెట్టారు. ఈ విషయాన్ని మావల పోలీస్ స్టేషన్ రెండో ఎస్సై గౌతమ్ పవర్ తెలిపారు.

## కంది పంట బుగ్గిపాలు

బజార్‌హత్నూర్, డిసెంబర్ 22 : కిన్నెరపల్లి గ్రామానికి చెందిన రైతు తొంటి సునీల్ కంది సాగు చేయగా.. పంట అగ్నికి ఆహుతి అయిన ఘటన ఆదివారం బజార్‌హత్నూర్ మండలంలో చోటు చేసుకుంది. కిన్నెరపల్లి గ్రామానికి చెందిన తొంటి సునీల్ తన ఐదెకరాల్లో కంది సాగు చేసి చేతికి వచ్చిన పంటను కోసి కుప్ప వేసి పొలంలోనే ఉంచాడు. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు పంటకు నిప్పు అంటించడంతో పూర్తిగా కంది పంట కాలిబుడిదైంది. విషయం తెలుసుకున్న బొర్రన్న ఘటన స్థలానికి చేరుకుని రైతు ఆవేదనను జరిగిన ప్రమాదపు వివరాలను అడిగి తెలుసుకున్నారు. దిగుబడి 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు నష్టం వాటిల్లిందని, దాదాపు రూ.2 లక్షల వరకు నష్టం జరిగిందని రైతు పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు పంచనామా నిర్వహించి నష్టపరిహారం అందించే విధంగా చూడాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు.